క్లుప్తంగా

కొనసాగుతున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు

నందిగామ: పట్టణంలోని ముక్కోటి మహా మండపంలో 123వ వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి విశేష పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టీబీని అంతమొందిద్దాం



జగ్గయ్యపేట అర్బన్: క్షయ వ్యాధిగ్రస్తుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో దాతలు, అధికారులు, రాజకీయ నాయకులు భాగస్వాములు కావాలని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లా హరీష్ తెలిపారు. గురువారం స్థానిక ఆయన మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానికంగా ఉంటున్న రోగులకు పౌష్టికాహారాన్ని దాతల సహకారంతో సమకూరుస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగా నలుగురు టీబీ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల పాటు పౌష్టికాహారాన్ని అందించనున్న కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, సామాజికవేత్త కర్లపాటి శ్రీనివాసరావును కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిక్షయ మిత్రాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. టీబీ సూపర్‌వైజర్ జి.నాగరాజు పాల్గొన్నారు.

మిర్చి పంట పరిశీలన



నందిగామ: సరైన సస్యరక్షణ చర్యలతో పంటలను పురుగులు, తెగుళ్ల నుంచి కాపాడుకోగలమని శాస్త్రవేత్తలు సూచించారు. మండల పరిధిలోని అడవిరావులపాడు గ్రామ పరిధిలో సాగు చేసిన మిర్చి పంటను గురువారం ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.విశాలాక్షి, వైఎస్సార్ హార్టికల్చర్ విశ్వ విద్యాలయం డాక్టర్ శిరీష పరిశీలించి, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నల్ల తామర పురుగు ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. మిర్చి పంటకు తెగుళ్లు అధికంగా ఆశిస్తాయని, వాటి నివారణకు సరైన మందులు, సరైన మోతాదులో వినియోగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి బాలాజీ కుమార్, మండల ఉద్యానాధికారి నీలిమ, రైతులు పాల్గొన్నారు.

డీపీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



వత్సవాయి : డెమొక్రటిక్ పీఆర్టీయూ క్యాలెండర్‌ను గురువారం మండల విద్యాశాఖాధికారి ఎల్. నాగరాజు ఆవిష్కరించారు. వత్సవాయిలోని ఎమ్మార్సీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వీటిని యూనియన్ నాయకులు సమక్షంలో ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీపీఆర్టీయూ ఏర్పడిన అనతికాలంలోనే ఉపాధ్యాయుల సమస్యలపై తనదైన శైలిలో పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మోంగియానాయక్, బెల్లంకొండ పూర్ణయ్య, రాష్ట్ర కార్యదర్శి బి బుజ్జిబాబు, జిలానీ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోండి



జగ్గయ్యపేట అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని ధర్మవరప్పాడుతండా చెందిన భూక్యా సురేష్‌కు ముఖ్యమంత్రి సహాయ మంజూరైన రూ. 26 వేలు, మల్కాపురం గ్రామానికి చెందిన పంద్రకోల రాధమ్మకు రూ. 24 వేలు, గౌరవరం గ్రామానికి చెందిన మార్తి త్రివేణికు మంజూరైన రూ. 15 వేలు మొత్తం రూ. 65 వేల చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, డైరెక్టర్ రవిశంకర్, సొసైటీ అధ్యక్షుడు బాలసైదా, నాయకులు షేక్ మొహిద్దీన్, ఫిరోజ్‌ఖాన్, వేముల మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నామినేటెడ్‌లో బీసీలకు సముచిత స్థానం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యేలు జగన్‌మోహనరావు, వెలంపల్లి

- మంత్రి జోగి రమేష్
- తొలిసారిగా ముస్లింలకు యార్డు చైర్మన్ పదవి
- అట్టహాసంగా చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం

నందిగామటౌన్: రాష్ట్రంలోని నామినేటెడ్ పదవుల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో చైర్మన్, వైస్ చైర్మన్లతో పాటు డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులన్నీ ఓసీలకే దక్కేవని కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి



ప్రమాణ స్వీకారం చేస్తున్న యార్డు డైరెక్టర్లు

తీసుకున్న గొప్ప నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం దక్కిందన్నారు. నందిగామ మార్కెట్ యార్డు చైర్మన్‌గా గతంలో ఎన్నడూ లేని విధంగా ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన మస్తాన్‌ను నియమించటం గర్వకారణమన్నారు.

కష్టానికి తగిన ప్రాధాన్యం: వెలంపల్లి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో బీసీలకు సముచిత స్థానం దక్కిందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పని చేసే వ్యక్తులకు తగిన ప్రాధాన్యతనివ్వటం జరుగుతుందని చెప్పారు.

కృషికి ఫలితం:ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

రైతు కుటుంబానికి చెందిన మహ్మద్ మస్తాన్‌ను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను చేశామని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధితో పాటు జరిగిన అన్ని ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి మస్తాన్ కృషి చేశారన్నారు.

విధేయతకు పట్టం: ఎమ్మెల్సీ అరుణకుమార్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన నాటి నుంచి మహ్మద్ మస్తాన్ పార్టీకి విధేయుడిలా పని చేశారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో మస్తాన్‌కు అనుభవం ఉండటంతో రైతు కష్ట నష్టాలు తెలిసిన వ్యక్తి చైర్మన్‌గా ఉంటే రైతులకు మేలు జరుగుతుందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం..

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మహ్మద్ మస్తాన్, వైస్ చైర్మన్‌గా నల్లమల్లి మురళీలతో పాటు డైరెక్టర్లతో యార్డు కార్యదర్శి శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి జోగి రమేష్, మాజీ మంత్రులు వెలంపల్లి శ్రీనివాసరావు, వసంత నాగేశ్వరరావులను ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణ్ కుమార్‌లు ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, ఎంపీపీలు అరిగెల సుందరమ్మ, వేల్పుల ఏశమ్మ, మలక్ బషీర్, కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు ముక్కపాటి నరసింహారావు, వేల్పుల ప్రశాంతి, అమర్లపూడి కీర్తి సౌజన్య, మండల కన్వీనర్లు దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నెలకుదిటి శివనాగేశ్వరరావు, ఆవుల రమేష్ బాబు, కందుల నాగేశ్వరరావు, కోటేరు ముత్తారెడ్డి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం



కొత్త పింఛన్లు అందిస్తున్న ప్రభుత్వవిప్ ఉదయభాను



నూతన పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పింఛన్ల వారోత్సవాలలో ప్రభుత్వ విప్ ఉదయభాను, ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పెనుగంచిప్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమంలో దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఏరాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పింఛన్ ఇవ్వటం లేదన్నారు. మండలంలో కొత్తగా 244 వివిధ రకాల పింఛన్లు మంజూరయ్యాయని వీటితో మొత్తం 8,447 మంది పింఛన్‌దారులు ఉన్నారన్నారు. ఈమూడున్నరేళ్లలో కేవలం పింఛన్ల కోసం ప్రభుత్వం మండలంలో రూ.57,67 కోట్లు అందించిందన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, శ్రీతిరుపతమ్మవారి ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరక్టర్లు బత్తుల రామారావు, కుమారి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు చైతన్య, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వేల్పుల రవికుమార్, తహసీల్దార్ కె లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

పండగలా పింఛన్ల పంపిణీ

వత్సవాయి: రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండగలా ఉందని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. పింఛన్ల పంపిణీ వారోత్సవాలలో భాగంగా గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సర్పంచ్ భూక్యా సీతమ్మ, ఎంపీపీ చెంబేటి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, వైస్ ఎంపీపీలు కాటేపల్లి రామలక్ష్మి, కొలికిపోగు వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు గాదెల రామారావు, సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముత్తయ్య, కాటేపల్లి రవికుమార్, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సూర్యోదయానికి ముందే పింఛన్ల పంపిణీ

నందిగామటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సూర్యోదయానికి ముందే వలంటీర్లు లబ్ధిదారుని ఇంటికి వెళ్లి ఆత్మీయంగా పలుకరిస్తూ ఠంఛన్‌గా పింఛన్‌లు అందిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల సుందరమ్మ, వైస్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు, అన్నం పిచ్చయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నెలకుదిటి శివనాగేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు
- కంచికచర్లలో గడప గడపకు మన ప్రభుత్వం

కంచికచర్ల: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండల కేంద్రమైన కంచికచర్ల 8 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండో రోజైన గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలకరించంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ, దేశ చరిత్రలోనే ప్రజలకిచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చిన ఏకైక సీఎంగా జగన్ నిలిచారని చెప్పారు. సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత మన ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ధ్యేయమన్నారు.

అన్ని పథకాల అమలు..

గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ, ఆర్బీకేలు, మన బడి నాడు – నేడు, లక్షల సంఖ్యలో ఇళ్ల పట్టాల పంపిణీ, వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం, జగనన్న మోడల్ కాలనీలు, అమ్మ ఒడి, విద్యా దీవెన,



కంచికచర్లలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు


ఉన్నత కులాల్లోని నిరుపేదలకు ఆర్థిక సాయం అందించడం, ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ... సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచ్ వేల్పుల సునీత, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, నాయకులు కాలవ పెదబాబు, నంబూరు పెదబాబు, కాలవ వాసుదేవరావు, మాడుగుల మధుబాబు, నారిశెట్టి శ్రీనివాసరావు, దేవరపల్లి గురవయ్య, వంగా శ్రీనివాసరావు, ఎం.పాండు, గ్రంధి వెంకటేశ్వరరావు, దాసరి రాము, మాగుడుల శంకర్, శేషం వాసుబాబు, తంగిరాల సృజనీకుమార్, వేల్పుల రమేష్, డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, ఏపీఎం కోట భాస్కరరావు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

డీఈఓ ఆకస్మిక సందర్శన



నందిగామ: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని మంచి పేరు తెచ్చుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక సూచించారు. నందిగామ, చందర్లపాడు లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను గురువారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరీక్షించారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిందన్నారు. విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. డీఈఓ వెంట ఎంఈఓ బాలాజీ, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



నందిగామటౌన్: ఉచిత కోచింగ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకుని నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. పట్టణంలోని ఓసీ క్లబ్‌లో శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్‌ల సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ సెంటర్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత సమయాన్ని వృధా చేసుకోకుండా శ్రద్ధగా చదువుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. అనంతరం ఉచితంగా అందజేసిన స్టడీ మెటీరియల్‌ను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ పసుపులేటి రాదాసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో గురువారం ఆలయ ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వస్తున్నారన్నారు. భక్తులకు అనుగుణంగానే పలు ప్రతిపాదనలు తయారు చేశామని తెలిపారు. కొండ కింద ఉన్న స్వామి వారి సత్రాలలో ఏసీ గదుల ఏర్పాటుతో పాటు అన్నదానం విరాళాలకు సంబంధించిన రూ. 20లక్షల ఎఫ్‌డీ కొనుగోలు చేయటం, పులిహోర తయారీ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. అంతేకాకుండా ఈ ఏడాది ఆలయంలో కుంభాభిషేకం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని అందుకు పాలకవర్గ తీర్మానం కూడా చేశామని తెలిపారు.



పాలకవర్గ సమావేశంలో తీర్మానాలు చేస్తున్న సభ్యులు

జాతీయ రహదారి కూడళ్ల ప్రాంతాలలో ఆర్చి గేటు ఏర్పాటుకు తీర్మానించామని చెప్పారు. దీంతో పాటు పలు తీర్మానాలు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు, కోఆప్షన్ సభ్యులు తిరునగరి రామకృష్ణమాచార్యులు, పాలకవర్గ సభ్యులు ఉషారాణి, లక్ష్మీ, పార్వతీ, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలకు భూమి కేటాయింపు

రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు కాలె పుల్లారావు

జగ్గయ్యపేట అర్బన్: సంక్షేమంలో సామాజిక న్యాయం కనబరుస్తూ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వ విశేష కృషి చేస్తోందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు కాలె పుల్లారావు అన్నారు. గురువారం పట్టణానికి వచ్చిన ఆయనకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పలువురు ఎస్సీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో పుల్లారావు మాట్లాడుతూ ఎస్సీల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలలో శ్మశాన వాటికలు లేక ఇబ్బందులు పడుతుండటాన్ని గుర్తించిందని తెలిపారు. ప్రతి గ్రామంలో శ్మశానవాటికలకు స్థలాలు ఇవ్వడానికి నిర్ణయించిందన్నారు. పెద్ద గ్రామంలో అయితే ఎకరం స్థలం, చిన్న గ్రామంలో



మాట్లాడుతున్న కాలె పుల్లారావు, చిత్రంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

అర ఎకరం స్థలం చొప్పున ఇవ్వడానికి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, తహసీల్దార్ నాగేశ్వరరావు, కౌన్సిలర్లు పందుల రోశయ్య, వట్టి మనోహర్, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు అన్నెపాగ నరసింహారావు, మాజీ ఎంపీపీ మాతంగి వెంకటేశ్వర్లు, కోట ప్రభుజి, ఎం.నాగేంద్రం, ఎస్సీ ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

వనితలే నిర్ణేతలు


జగ్గయ్యపేటలో మొత్తం 1,96,109 మంది ఓటర్లు

జగ్గయ్యపేట: పేట నియోజకవర్గ వ్యాప్తంగా 1,96,109 మంది ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ సీహెచ్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలకు జిల్లా ఎన్నికల అధికారి గురువారం ఓటర్ల జాబితా విడుదల చేశారన్నారు. ఇందులో భాగంగానే జగ్గయ్యపేట పురపాలక సంఘం, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలతో పాటు నందిగామ నియోజకవర్గంలోని ఎటిపట్టు గ్రామాల్లో పురుషులు 94,724, మహిళలు 1,013,85 మంది ఓటర్లు ఉన్నారన్నారు.

మండలం	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు
జగ్గయ్యపేట (మండలం,పట్టణం)	94,399	45,449	48950
వత్సవాయి	47,528	23,009	24,519
పెనుగంచిప్రోలు	39,673	19,244	20,429
నందిగామలోని ఏటిపట్టు గ్రామాలు	14,509	7,022	7,487

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

లింగాల(వత్సవాయి) : వైఎస్సార్–జగనన్న మోడల్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేలా చూడాలని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అధికారులను ఆదేశించారు. గురువారం గ్రామంలో నిర్మాణాలు జరుగుతున్న ఇళ్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేస్తున్న పథకాలను అధికారులు అదే దృష్టి పెట్టి సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. మోడల్ కాలనీలో 78 మందికి పట్టాలు అందించగా వారిలో 60 మందికి వరకు నిర్మాణాలు చేపట్టారని.. మిగతా వారు కూడా త్వరలో ఇంటి నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే సిమెంట్, ఇనుము, ఇసుకను సకాలంలో అందించాలన్నారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎంపీడీవో ఎస్వీ ప్రసాద్,



లింగాలలో ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీస్తున్న ప్రభుత్వవిప్ ఉదయభాను

హౌసింగ్ ఏఈ చిదంబరేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు గాదెల రామారావు, లింగాల గ్రామ పార్టీ నాయకులు అంబోజి వెంకటకృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు కనకచందరరావు, జీవరత్నం పాల్గొన్నారు.

ఏపీటీడీ సొసైటీ డైరీ ఆవిష్కరణ



ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్(ఏపీటీడీ) క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ ఏ.సుబ్రహ్మణ్యం అన్నారు. ఉద్యోగులతో కలసి సొసైటీ డైరీని గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు లోన్ కోసం సొసైటీని ఆశ్రయిస్తే రూ.0.91 పైసల వడ్డీతో రుణం మంజూరు చేస్తారన్నారు. పిల్లల విద్యకు కూడా రుణాలు ఇస్తారని తెలిపారు. సీసీఎస్ సభ్యులు ఎన్.అనంత రాములు మాట్లాడుతూ గతంలో లేని విధంగా పండుగల పేరుతో రూ.20 వేలు వరకు ఉద్యోగులకు లోన్ ఇస్తారన్నారు. నూతన సాఫ్ట్‌వేర్‌తో సత్వర సేవలు అందుతున్నాయన్నారు. సీసీఎస్ సభ్యుడు సుబ్బారావు, సూపరింటెండెంట్ పీవీ రావు, జ్యోతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

టెక్నాలజీ, ఫైనాన్సియల్ సర్వీసెస్‌పై వెబినార్

ఇబ్రహీంపట్నం: నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో టెక్నాలజీ, ఫైనాన్సియల్ సర్వీసెస్ అంశంపై జాతీయ వెబినార్ గురువారం నిర్వహించారు. ముఖ్య ప్రసంగీకులుగా ఫాఫిన్‌టెక్ వ్యవస్థాపకుడు తన్నీరు రవి పాల్గొని నూతన టెక్నాలజీతో ఆధార్ ద్వారా బ్యాంకుల నగదు బదిలీ, యూపీఐ, రానున్న రోజుల్లో ఆటోమేషన్ విభాగంలో ఫైనాన్స్ ఉత్పత్తులు, ఉద్యోగ అవకాశాల అంశాలను వివరించారు. నైపుణ్యాల పెంపునకు విద్యార్థులు ఎంచుకోవల్సిన పద్ధతులు తెలియజేశారు. అకడమిక్ డైరెక్టర్ తమ్మినేని నారాయణమూర్తి చైర్మన్‌గా వ్యవహరించారు. ప్రిన్సిపాల్స్ అక్బర్‌ఖాన్, అబ్దుల్ బాజీ పాల్గొన్నారు.

సెంట్రింగ్ మేస్త్రీ కుటుంబానికి సాయం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఆర్సీఎం కాలనీకి చెందిన సెంట్రింగ్ మేస్త్రి జాన్ కిషోర్ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జాన్ కిషోర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మట్టి ఖర్చుల నిమిత్తం నగదు అందజేశారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జ్వానేష్, కొప్పుల కుమార్, మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

సంప్రదాయ క్రీడలు నిర్వహించాలి



షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు తెలిపే సంక్రాంతి పండుగకు సంప్రదాయ బద్ధమైన క్రీడలు నిర్వహించుకోవాలని ఐద్వా నాయకురాలు సోమోజు నాగమణి సూచించారు. గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సీఐటీయూ, ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్, టోర్నమెంట్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నమన్నారు. సంప్రదాయ బద్ధంగా గ్రామీణ స్థాయిలో ముగ్గులు, ఆటలు, వంటల పోటీలు నిర్వహించుకుని పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పోటీలలో గెలుపు ఓటములు సహజమని క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు దంతాల వెంకటేశ్వర్లు కోట కృష్ణ, లింగారావు, గౌస్‌మియా, బడేమియా, రవికుమార్, కృష్ణ, రామనాధం, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.